రైతుల సంక్షేమానికి పెద్దపీట

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు
- గోకవరంలో సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం. చిత్రంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

గోకవరం: రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. స్థానిక సూర్య ఫంక్షన్ హాల్‌లో బుధవారం గోకవరం విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ)నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో తోట నరసింహం, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సొసైటీ చైర్మన్‌గా దాసరి చినబాబు, డైరెక్టర్లుగా బద్దిరెడ్డి సూర్యనారాయణ, కొత్త సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సుమారు రూ.13 వేల కోట్ల రైతుల రుణాలను మాఫీ చేసి అన్నదాతలను ఆదుకున్నారన్నారు. ఆయన బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతాంగానికి అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. సుమారు 3200 మంది సభ్యులు ఉన్న గోకవరం సొసైటీ రూ.10 కోట్ల టర్నోవర్‌తో ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. నూతన చైర్మన్ దాసరి చినబాబు ఆధ్వర్యంలో సొసైటీ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, జిల్లా సహకార శాఖ అధికారి ఎర్ర ఉమామహేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, గోకాట చిట్టిబాబు, నాయకులు సుంకర వెంకటరమణ, సమ్మెటి నాని, రౌతు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలకు యాతన లేకుండా చర్యలు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వివిధ రూపాల్లో విరాళాలు సమర్పించే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానించింది. దేవస్థానానికి రూ.కోట్లు, రూ.లక్షల్లో విరాళాలు సమర్పించిన దాతలు సత్యదేవుని ఆలయానికి వచ్చినపుడు పడే ఇబ్బందులపై 'సత్తెన్న సాక్షిగా దాతలకు యాతన' అనే శీర్షికతో ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన బుధవారం రత్నగిరిపై జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ అంశంపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. రూ.లక్ష, అంత కంటే ఎక్కువ విరాళాలిచ్చిన దాతలకు విరాళాలను అనుసరించి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు విరాళాలిచ్చిన దాతలకు పదేళ్లపాటు ఏడాదికి రెండు సార్లు ఆయా విరాళాల స్కీంలో పొందుపర్చబడిన సదుపాయాలు కల్పిస్తారు. రూ.10 లక్షలకు మించి విరాళాలిచ్చిన దాతలకు 15 సంవత్సరాల పాటు ఏడాదికి మూడు సార్లు విరాళాల స్కీంలో పొందుపర్చిన సదుపాయాలు కల్పిస్తారు. దాతలకు వసతులు కల్పించేందుకు గాను ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ సమావేశంలో ఈఓ రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


అటికెవానిపాలెంలో నూకాలమ్మతల్లి ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

తుని రూరల్: మండలంలోని అటికెవానిపాలెంలో పునర్నిర్మిస్తున్న నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము బుధవారం భూమి పూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా మంజూరు చేసిన రూ.10 లక్షలతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు ఎంపీపీ డాక్టర్ రాము తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, డి.పోలవరం మాజీ సర్పంచ్ చిటికెల వెంకటరమణ, ఉప సర్పంచ్ అటికె వీర్రాజు, నాయకులు చిటికెల వరహాలబాబు, రవిరాజు, గోసుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఏలేశ్వరం: మండల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ


ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సాయిబాలాజీ బీఈడీ కళాశాల, ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని లింగంపర్తి రోడ్డు, షిర్డీ నగర్, మెయిన్‌రోడ్ మీదుగా ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక బాలాజీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు వాగు గోపాల కృష్ణ, ఉద్దగిరి సోమరాజు, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన దేవదాయశాఖ కమిషనర్


దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు సత్యదేవుని ప్రసాదం అందజేస్తున్న ఈఓ

అన్నవరం: రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ కె.రామచంద్రమోహన్ అందజేశారు. ఆయన వెంట ఏసీపీ.విశ్వనాథరాజు ఉన్నారు.

నగదు భద్రతలో జాగ్రత్తలు పాటించాలి

గండేపల్లి: బ్యాంకుల్లో నగదు, నగల భద్రతపరచే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం బ్యాంకు మేనేజర్లు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల బయట, లోపల సీసీ కెమెరాలు, అల్లారం పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలన్నారు. సేఫ్టీ, స్ట్రాంగ్ రూమ్‌లు పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గుమ్మాలు, కిటికీలు, షట్టర్లు పటిష్టంగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడన్నా భద్రతా లోపాలు ఉంటే సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుని పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పలు బ్యాంకుల మేనేజర్లు, ఎస్ఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.ప్రసాదానం బుధవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23వ తదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యతో పాటు ఉచిత వసతి, రుచికరమైన భోజనం అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం


మర్రిపీడులో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, వరుపుల

- ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- మర్రిపీడులో గడపగడపకూ మన ప్రభుత్వం

ఏలేశ్వరం: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని మర్రిపీడులో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ అనంతబాబు, కో ఆర్డినేటర్ సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూలేని విధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, పార్టీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి, పల్లెల బ్రహ్మాజీరావు, బంటుపల్లి ప్రసాద్, కస్తూరి అప్పలరాజు, నానిశెట్టి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం ఆడియో సాంగ్ పోస్టర్ విడుదల


ఏలేశ్వరంలో పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: ప్రేమికుల రోజు పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో బుధవారం షార్ట్ ఫిలిం ఆడియో సాంగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రముఖ గాయకుడు, దర్శకుడు పల్లవిజోషి ఆధ్వర్యంలో జోషి .. ఎటువెళ్లిపోను ? ఉప శీర్షికతో పోస్టర్‌ను ఆవిష్కరించారు. గేయ రచయిత చంటి మిర్యాల మాట్లాడుతూ జోషి అనే షార్ట్ ఫిలింలో ప్రైవేట్ సాంగ్స్‌ను విడుదల చేస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే తెలుగు, హిందీ భాషల్లో పాటలను విడుదల చేస్తామన్నారు. దర్శకుడు విజయ్, గాయకులు అవినాష్, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ


ఇర్రిపాకలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠిస్తున్న పరిపూర్ణనంద సరస్వతీ స్వామీ

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాక ఏలేరు నదీ తీరంలో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం అంగరంగవైభవంగా జరిగింది. కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతీ చేతుల మీదుగా ద్వాదశ లింగాలను ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు, కుటుంబ సభ్యులు ఏలేరు నది తీరంలో గత నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ దేశంలో ఎంతో విశిష్టత కలిగిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏలేరు నదీతీరాన శివాలయంలో ప్రతిష్ఠించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వాయు ప్రతిష్ఠ చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ శివలింగాలను తాకి అభిషేకాలు, దర్శనం చేసుకోనే అవకాశం ఉందని తెలిపారు. మాజీ మంత్రి కాపు, ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శివరాత్రి రోజు మహా కుంభాభిషేకానికి సిద్ధం చేస్తున్న శివలింగాలను పరిశీలించారు.

తోట నరసింహానికి మద్దతుగా బైక్ ర్యాలీ


వీరవరంలో తోట నరసింహాన్ని కలిసి మద్దతు తెలుపుతున్న గొరకపూడి గోపీనాథ్ తదితరులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం నాయకత్వంలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని గొరకపూడి వెంకట్రావు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొరకపూడి గోపీనాథ్ అన్నారు. గోపీనాథ్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం సుమారు 200 మంది పార్టీ అభిమానులు బైక్ ర్యాలీగా వీరవరం చేరుకుని తోట నరసింహానికి మద్దతు తెలిపారు. తోట నరసింహం వారిని పేరుపేరునా పలకరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గొరకపూడి గోపీనాథ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తోట నరసింహం గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు తోట రాంజీ, తోట బాబ్జీ, అడబాల వెంకటేశ్వరరావు, ఉంగరాల సత్యనారాయణ, పెంటపాటి మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజాను కలసిన సునీల్


తునిలో మంత్రి రాజాను కలిసిన చలమలశెట్టి సునీల్

తుని: మండలంలోని ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలమలశెట్టి సునీల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ నియోజవర్గఇన్‌చార్జ్‌గా నియమితులై తొలిసారి వచ్చిన సునీల్‌కు మంత్రి రాజా ఆత్మీయ స్వాగతం పలికారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ ఏలూరి బాలు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ బొప్పన రాము, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ పోతుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చలమశెట్టి సునీల్‌కు ఘన స్వాగతం

ఏలేశ్వరం/శంఖవరం/గండేపల్లి/జగ్గంపేట/కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్‌కు యర్రవరంలో బుధవారం ఘనస్వాగతం లభించింది. పార్టీమెంటరీ ఇన్‌చార్జ్‌గా తొలిసారి నియోజకవర్గానికి రావడంతో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు యర్రవరంలో ఘన స్వాగతం పలికారు. శంఖవరం మండలం కత్తిపూడి నాలుగు కూడలి జంక్షన్ వద్ద పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు ఈగల విజయదుర్గ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. జగ్గంపేటలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సునీల్‌కు స్వాగతం పలికారు. గండేపల్లి మండలం మురారిలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్వాగతం పలికారు. చలమలశెట్టి సునీల్‌ను, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజవర్గ మాజీ ఇన్‌చార్జి ముత్యాల శ్రీనివాస్‌ను పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కిర్లంపూడి మండలం వీరవరంలో వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహాన్ని పార్టీ కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జి చెలమలశెట్టి సునీల్ బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు.


వీరవరంలో తోట నరసింహాన్ని కలిసిన చలమలశెట్టి సునీల్

నేటి నుంచి కొండరాజులబాబు జాతర

ఏలేశ్వరం: మండలంలోని రమణయ్యపేట వేంచేసిన కొండరాజులబాబు జాతర మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఏజెన్సీ ప్రాంతం నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 29 వరకూ స్వామివారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది మూడు శుక్రవారాలు రాగా ప్రతివారం తీర్థం జరుగుతుంది. కాగా జాతరలో వేట్లపాలెం వారితో కోయ డ్యాన్స్, డప్పుల మేళం, కోనారి చువారి డ్యాన్స్, మ్యూజిక్ బ్యాండ్, లక్కగుర్రాలు, కొమ్ములాట, వెలుగుబంద వారితో గరగ నృత్యం, రమణయ్యపేట యూత్ వారితో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బాణాసంచా ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

ముగిసిన సత్తెమ్మతల్లి జాతర

ప్రత్తిపాడు: స్థానిక రాజుగారి వీధిలో వేంచేసిన సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ప్రత్తిపాడుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. నైవేద్యాలు సమర్పించారు. ఐదు రోజుల పాటు అంగరంగవైభవంగా ఉత్సవాలు జరిగాయి. చివరి రోజు అమ్మవారిని ఘటంలో ఉంచి, పంపనాదం వంశానికి చెందిన పురుషుడు మహిళ వేషధారణ ధరించి అమ్మవారిని శిరస్సున దాల్చి గ్రామోత్సవం నిర్వహించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకాలు చేశారు. తీన్‌మార్ డ్యాన్స్‌లు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని సాగనంపారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు సామవేదం షణ్ముఖశర్మ రాక

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి దేవస్థానానికి శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖ శర్మ రానున్నట్టు శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద బుధవారం తెలిపారు. రథసప్తమిని పురస్కరించుకొని ఆ రోజు సాయంత్రం 4 గంటలకు షణ్ముఖ శర్మ అనుగ్రహ భాషణం చేస్తారని చెప్పారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సాయి కిరణ్

కిర్లంపూడి: స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌గా కె.సాయి కిరణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఆయన కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లో పౌరసరఫరాల అధికారిగా విధులు నిర్వహించారు. క్రమబద్ధీకరణలో భాగంగా ప్రస్తుతం డీటీగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సాయికిరణ్‌కు సిబ్బంది, పలువురు రేషన్ డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఏలేశ్వరంలో జగనన్న ఆరోగ్య సురక్ష


ఏలేశ్వరంలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక 7వ సచివాలయం పరిధిలో రోగులకు డాక్టర్ పాపారావు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజలు సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాబేళ్ల సంరక్షణపై అవగాహన

తొండంగి: సముద్రంలో తాబేళ్ల సంరక్షణకు మత్స్యకారులు సహకరించాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు కోరారు. జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని అద్దరిపేట, దానవాయిపేట, యర్రయ్యపేట, పంపాదిపేట, కొత్తపేట, తాటియాకులపాలెం, పెరుమాళ్లపురం, కొత్తపోడిపల్లిపేట తదితర మత్స్యకార గ్రామాల్లో తాబేళ్ల ప్రాముఖ్యత, ప్రయోజనాలు, సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతంలో తాబేళ్లు గుడ్లు పెట్టే కాలం కావడంతో ఆ ప్రాంతంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాబేళ్ల రక్షణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మత్స్యకార పెద్దలు, గ్రామసచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా వసంత పంచమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఉత్సాహంగా సామూహిక అక్షరాభ్యాసాలు


ఒమ్మంగిలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


తుని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు


యర్రవరంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

తుని: వసంత పంచమి వేడుకలు బుధవారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరిగాయి. స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 150 మంది చిన్నారులు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. అక్షరాభ్యాసం చేసే చిన్నారులకు తుని జేసీఐ సంస్థ ప్రతినిధులు పలక, బలపం, పూజాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా శిశుమందిర్ ప్రధానాచార్యా మాట్లాడుతూ సరస్వతీ శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలని, ఇక్కడ చదివిన పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పీఎంసీ, జేసీఐ, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మండలంలోని కొత్తసూరవరం ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు 10 వస్తువులతో కూడిన విద్యా కిట్లను చిన్నారులకు అందజేశారు. అంజనేయప్రసాద్, పరవాడ తాతబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గోకవరం: మండల వ్యాప్తంగా బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవీచౌక్ ఆలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏలేశ్వరం: చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని యర్రవరంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సరస్వతీ శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కటకం కిరిటీ, ఏడీపీ ప్రసాద్, తూమురోతు గురయ్య, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/గండేపల్లి: మండల వ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాలు, పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఒమ్మంగిలో లక్ష్మీ గణపతి హోమాలు, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.